తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# స్వర్ణరథంపై విహరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో స్వామివారు ఆదివారం సాయంత్రం ఉభయదేవేరులతో కలసి స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ఆలయంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం సంకటహర చతుర్థి వ్రతంను ఘనంగా నిర్వహించగా సాయంత్రం స్వామివారికి స్వర్ణ రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మిరమిట్లు గొలుపుతున్న స్వర్ణరథంపై వుంచి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ మాడా వీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# భర్తను కడతేర్చిన భార్య

**ప్రియుడితో కలిసి పక్కా పథకంతో హత్య**
**నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు**
**కోడిగుట్ట రోడ్డు మృతదేహం.. మిస్టరీని ఛేదించిన పోలీసులు**



ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసిన సెల్వమణి, ప్రియుడు వినయ్, అతని స్నేహితులను అరెస్టు చేసిన పోలీసులు

చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
వివాహేతర సంబంధానికి భర్తను అడ్డు తొలగించుకోవాలని భావించిన భర్త ప్రియుడు, అతని స్నేహితులతో కలిసి పక్కా పథకం రచించి భర్తను కడతేర్చింది. చిత్తూరు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల మొయిన్ గేటు ఎదుట పోవు కోడిగుట్ట రోడ్డులో ఈ నెల 5వ తేదీన ఎ.వడివేలు(32) హత్య గావించబడ్డ విషయం విదితమే. ఈ మేరకు చిత్తూరు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించడంతో హత్యకు గురైన వడివేలు భార్య ఎ.సెల్వమణి ఈ హత్యలో కీలక పాత్ర పోషించిందని పోలీసులు నిర్ధారించారు. చిత్తూరు గిరింపేట బాలాజీ కాలనీకి చెందిన ఎ.సెల్వమణి, ఎ.వడివేలులు భార్యభర్తలు, వడివేలు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో భార్య ఎ.సెల్వమణి చిత్తూరు చర్చివీధి పరిధిలోని స్వామిమేస్త్రీ వీధికి చెందిన ఎస్.వినయ్(30)తో వివాహేతర సంబంధం పెట్టుకొంది. ఈ వివాహేతర సంబంధం సెల్వమణి, వినయ్‌ల మధ్య గాఢంగా నెలకొనడంతో ఒకరు వదలి మరొకరు వుండలేని స్థితికి చేరుకొంది. సెల్వమణి తనకు ఇంకా పెళ్ళికాలేని మొదట వినయ్‌ను నమ్మించి ప్రేమలోకి దింపింది. అయితే ఆపై సెల్వమణికి ఆటోడ్రైవర్ వడివేలుతో పెళ్ళి జరిగిందని తెలియడంతో వినయ్ సెల్వమణిని తనతో పాటు పూర్తి సమయం వుండాలని కోరేవాడు. ఇలా చేయాలంటే తన భర్త వడివేలును వదిలించుకొంటే సాధ్యపడుతుందని సెల్వమణి చెప్పడంతో వినయ్ వడివేలును హత్య చేయడానికి అంగీకరించాడు. ఈ మేరకు వినయ్ తన స్నేహితుడైన సంతపేట సున్నపువీధికి చెందిన ఆర్.నిరంజన్(30)ను సంప్రదిస్తే అతను కిరాయి హంతకుడు వల్లియప్పనగర్‌కు చెందిన ఎం.కిషోర్(29)ను పరిచయం చేశాడు. ఈ మేరకు వినయ్, నిరంజన్, కిషోర్‌లు కలిసి ఈ నెల 5వ తేదీ మద్యం సేవించారని ఆటోడ్రైవర్ వడివేలును కోడిగుట్ట రోడ్డు వద్దకు తీసుకెళ్ళి మద్యం తాపించారు. ఆపై వడివేలుపై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఆపై ముగ్గురు అక్కడి నుండి పరారీ అయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన తాలుకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యాచ్చారి ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిలు ఆదివారం వడివేలును హత్య చేసిన భార్య సెల్వమణితో పాటు ఆమె ప్రియుడు వినయ్, అతనికి సహకరించిన స్నేహితుడు నిరంజన్, కిరాయి హంతకుడు కిషోర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ హత్య కేసు చేధనలో కీలకంగా వ్యవహరించిన చిత్తూరు తాలుకా ఇన్స్‌పెక్టర్ మద్దయ్యాచ్చారి, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిలను డిఎస్పీ శ్రీనివాసమూర్తి ప్రత్యేకంగా అభినందించారు.

# ఉదారంగా నష్టపరిహారం

**చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



తిరుపతిరూరల్, డిసెంబర్11 ప్రభాతవార్త:
మాండూస్ తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన ఆస్తుల, పంటల నష్టాల అంఛనాలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆదేశించారు. ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ రెడ్డప్పలతో మాం డూస్ తుఫాను బాధితులకు నష్టపరిహారం అందించడానికి చేపట్టాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించారు. తుఫాన్ వల్ల ఆయా జిల్లాలలో జరిగిన ఆస్తి, పంట నష్టాల వివరాలతో పాటు పునరావాస చర్యలు, ఆస్తి, పంట నష్టాల అంఛనాలపై తీసుకొంటున్న చర్యలపై మంత్రి ఆరా తీసారు. వీడియో కాన్ఫరేన్స్‌లో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి సమీక్షిస్తున్నారన్నారు. షెల్టర్స్‌లో ఉన్నవారికి, ఇల్లులు దెబ్బ తిన్నవారికి సత్వరం సహాయం అందించే చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు పూర్తి అప్రమత్తతో పని చేసారని, పంట నష్టం ఆస్తి నష్ట పరిహారం కోసం అంఛనాలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్‌కు పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు దిశ నిర్ధేశం చేసారు. తిరుపతి జిల్లాలో అత్యధిక వర్షపాతం 10వ తేదీ వరకు నమోదైందని, మొత్తం 34 మండలాలలో దాదాపు 200 ఎం.ఎం. కంటే ఎక్కువగా 10 మండలాల్లోను, 150 ఎం.ఎం.కంటే మించి 20 మండలాల్లో వర్షపాతం నమోదైందని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మంత్రికి వివరించారు. ఎటువంటి మానవ ప్రాణ నష్టం ఇప్పటివరకు జరగలేదని, పెద్ద జంతువులు ఎద్దులు, ఆవులు 7, గొర్రెలు మేకలు 7 చనిపోవడం జరిగిందన్నారు. ఆస్తి నష్టానికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని, రెవెన్యూ యంత్రాంగం సంబంధిత శాఖలు వీటిపై సర్వే మొదలు పెట్టాలన్నారు. నేటి నుండి పూర్తిగా అంఛనా నివేదికలు తయారు చేస్నుట్లు తెలిపారు. ఇప్పటివరకు నాలుగు ప్రదేశాలు బాలాయపల్లి, రేణిగుంట, తడ, తిరుపతిలలో రిలీఫ్ క్యాంప్స్ పెట్టడం జరిగిందని, ఇప్పటివరకు 571 మందిని సురక్షితంగా రిలీఫ్ కేంద్రాలకు తరలించామన్నారు. తిరుపతిలోని వివిధ కాలనీలలో సుమారు 50ఇళ్లలోకి నీరు చేరడంతో తమిళస్కూల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 70మందిని వరకు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్వో శ్రీనివాసరావు, ఆర్డీఓ కనక నరసారెడ్డి, సిఎండి సంతోషరావు, ఎస్ఇ కృష్ణారెడ్డి, ఇంజనీ రింగ్ అధికారి శంకరనారాయణ, డిఎంహెచ్ఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం అందించడానికి చర్యలు తీసుకోవాలి



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
మాండూస్ తుఫాను బాధితులకు ఉదారంగా నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌తో పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మాండూస్ తుఫాను ప్రభావంతో సంభవించిన పంట నష్టంపై సత్వరం ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలని, అలాగే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంను అందించాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల్లో సగటున 92.6 మిమీ వర్షపాతం నమోదైందని మంత్రికి వివరించారు. మొదటి రోజు నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వుండి సహాయక చర్యలను వేగంగా చేపడుతుందన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రస్తుతం 416 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారని, వీరిలో అత్యధికులు యానాది కుటుంబాలకు చెందిన వారని వీరిని ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త
పూతలపట్టు మండలంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెం దారు. పీలేరు నుంచి చిత్తూరు తిమ్మిరెడ్డిపల్లికి చెందిన చెంగల్‌రెడ్డి(69), కస్తూరి (64) కాణిపాకంలో బంధువుల పెళ్లికి వెళ్లడానికి బస్టాప్‌కు వద్దకు వెళుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పూతలపట్టు ఎస్.ఐ హరిప్రసాద్, ఎమ్మార్వో విజయభాస్కర్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మృతిచెందిన దంపతులు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు అందించారు.

## ఏడుగంగమ్మల జాతర ఏర్పాట్లలో తలమునకలు

**బేరివారి మండపం వద్ద విద్యుత్ శోభ**



శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త
ఈ నెల 13,14 తేదుల్లో ఏడుగంగమ్మల జాతరకు నిర్వాహకులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి తెరపలు తెరపలుగా వర్షం కురుస్తుంది, అయితే ఏడుగంగమ్మల కమిటిల నిర్వాహకులు చలిని సైతం లెక్క చేయక ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే జయరామారావు వీధి, కొత్తపేట, గాంధధీవీధి గంగమ్మల వద్ద పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కుండపోత వర్షంలోనే నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం, తేరువీధి, సన్నిధివీధి గంగమ్మల స్థావరాల వద్ద భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండపాల వద్ద భారీ ఎత్తున విద్యుత్ ఏర్పాట్లు చేపట్టారు. ఇక ఆదివారం రాత్రి చాటింపు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇక నాలుగుమాడావీధుల్లో ఇప్పటికే దేవస్థానం విద్యుత్ శోభను కల్పించారు.

# గేట్లు ఎత్తేస్తారు.. వరద ముంచేస్తోంది




తడ, డిసెంబర్ 11 ప్రభాతవార్త
తీరప్రాంతంలో కాళంగి వరద గండం పొంచి ఉంది. తడ, సూళ్లూరుపేట మండలాలకు ఎగువన ఉన్న పూర్వపు చిత్తూరు జిల్లా మండలాల్లో వర్షం కురిసినప్పటికీ ఆ ప్రభావం కింది గ్రామాలపై పడుతోంది. ముఖ్యంగా కాళంగి నది కాలనాగులా ప్రవహించి పల్లెలను ముంచెత్తుతోంది. ప్రస్తుతం మాండోస్ తుపాను ప్రభావం కూడా ఇదే నష్టం కలిగిస్తోంది. కెవిబిపురం మండలంలోని కాళంగి డ్యామ్ గేట్లు ఎత్తేయడంతో గత రెండురోజులుగా కాళంగినది పరీవాహక ప్రాంతాలు జలమయం అయ్యాయి. అనేక కాలనీలునీళ్లతో నిండిపోయాయి. ఒక్క సూళ్లూరుపేట మండలంలోని 340 మంది నిరాశ్రయులయ్యారు. కాళంగి నది గేట్లు ఎత్తే సమయంలో కిందనున్న మండలాల అధికారులకు కూడా వారు సమాచారం ఇస్తారు. అయితే అప్పటికప్పుడే ప్రతి గ్రామానికి మండల స్థాయి అధికారులు ఈ సమాచారం చెప్పడం కష్టమవుతోంది. తెల్లారి లేచి చూసేటిప్పటికి గ్రామాలను కాళంగి నీరు చుట్టుముడుతున్నాయి. పలు రోడ్లపైకి నీరు చేరుకుంటున్నాయి. ప్రధానమైన సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి మార్గంలో మన్నారుపోలూరు వద్ద శనివారం సృష్టించిన జలవిలయం అంతాఇంతా కాదు. ఈ రహదారిపై కనీసం ఆరు అడుగుల నీరు చేరుకుంది. ఈ ప్రవాహం మరింత పెరిగి ఉంటే ఏకంగా జాతీయ రహదారిపైకి ప్రవహించేవి. సూళ్లూరుపేట సమీపంలోని గోకులకృష్ణ కాలేజి సమీపంలో నీళ్ల హైవేపైకి వచ్చి ఉండేవని అంచనా వేస్తున్నారు. వీటితో పాటు వట్రపాలెం అనే మున్సిపాలిటీ పరిధిలోని గ్రామం గత రెండురోజులుగా నీళ్లలోనే ఉంది. అక్కడి నుంచి అధికారులు పునరావాస కేంద్రాలకు జనాన్ని తరలించారు. కాళంగి సమీపంలోని పాముల కాలువ కూడా ఉప్పొంగి ప్రవహిస్తోంది. కాళంగి, పాముల కాలువలు కలుస్తున్న చోట కొత్తకొత్తగా ఏర్పడిన లేఅవుట్లు ఔటైపోయాయి. ఈ నీళ్ల పారడంతో అక్కడ స్థిరాస్తి వ్యాపారుల బండారం కాస్తా బయటపడింది. లేఅవుట్లు కనిపించకుండా నీళ్లే కనిపించడం విశేషం. ఈ వరద నీటితో వందలాది ఎకరాల వరిపంట జలమయమైంది. ఇదిలావుంటే కాళంగినదికి ఐదు గేట్లు ఎత్తడంతో 16వేల క్యూసెక్కుల నీళ్ల నదిలో ప్రవహించినట్లు అధికారులు చెప్తున్నారు.

## మళ్లీ ఏనుగుల సంచారం

సదుం, డిసెంబరు 11 ప్రభాతవార్త
మండల పరిధిలో గత పదిరోజులుగా అలికిడి లేకుండా ఉన్న ఏనుగుల సంచారం మళ్లీ మొదలైంది. శనివారం రాత్రి చెరకువారిపల్లె పంచాయతీ పరిదిలోని పలువురిపంటలను తొక్కి చిందర వందర చేశాయి. దాదాపు 10 ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరించినట్లుగా వాటి అడుగులను బట్టి రైతులు చెబుతున్నారు. శీలయ్యగారిపల్లెకు చెందిన రైతులు రమేష్, భాస్కర్, పీరూసాహెబ్, గురప్ప అనే రైతుల మామిడి తోటల్లో తిరిగాయి. అందిన కాడికి కొమ్మలు విరిచి వేశాయి. అదేవిధంగాచెరకు తోటలను తొక్కి తిన్నాయి. ఉప్పరపల్లెకు చెందిన నాగరాజు అనే రైతు వరిపంట కోతకు వచ్చేసింది. వర్షాలు కురవడంతో కోత కోయలేదు. అయితే



ఏనుగులగుంపు వచ్చి ఆ పొలాలను తొక్కి నాశనం చేశాయి. దీనితో రైతు లబోదిబో మంటున్నాడు. ఏనుగుల గుంపు బంగారుకనుమ వైపు వెళ్లాయని మళ్లీ రాత్రికి రావచ్చని ఆయా గ్రామల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పూట బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. వీఆర్వో పురుషోత్తం, వాటర్‌షెడ్ ఛైర్మెన్ జీవీ రమణలు వెళ్లి పంటలను పరిశీలించి తహశీల్దారుకు వివరాలు అందజేశారు.

## శివయ్య సన్నిధిలో భక్తజనసందోహం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్త జనంతో నిండింది. శివనామస్మరణతో దద్దరిల్లింది. ఓ వైపు మాండూస్ తుఫానుతో రాష్ట్రంలోనూ, తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే దానిని కూడా లెక్కచేయక భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఆలయంలో ఎటుచూసినా జనమే జనం అన్నట్లు మారింది పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి శని, ఆది, సోమవారాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. చెన్నై నుంచి తండోపతండాలుగా భక్తులు కదలివచ్చారు. పలువురు భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు రావడంతో ఆలయం భక్తుల సందడితో నిండిపోయింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాహుకాల సమయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కోరిన భక్తులందరికి అభిషేకాలందించటానికి అధికారులు చొరవ చూపారు.

### కిక్కిరిసిన జనసందోహం

ఆదివారం శ్రీకాళహస్తి పట్టణం,, సువర్ణముఖి నది పరిసరాలు ఓంకార నాదం, హర హర మహాదేవ శంభోశంకరా అంటూ దద్దరిల్లాయి. వేకువ జాము నుంచి తరలి వచ్చిన భక్త జనం జీవనది సువర్ణముఖిలో స్నానమాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీని గమనించిన ఇఓ వి.కె సాగంబాబు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఇక వచ్చిన భక్తుల వాహనాలు ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేశారు. కాంట్రాక్టర్లు సొమ్ములు వసూలు చేసుకుంటున్నారు కానీ వాహనాలకు కనీసం నీడ కల్పించటం లేదు. వీధులే వారికి పార్కింగ్ మారుతుంది. సన్నిధివీధి, జల వినాయక బ్రిడ్జిపై వచ్చిన భక్తులు వాహనాల పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. దేవస్థానం అధికారులు ఏడాదికి కోట్లు పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. కానీ వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేదు.

## హిమగిరులుగా మారిన శేషాచలం

**-ప్రకృతి జలపాతాలతో ఆహ్లాదకరం**



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
శేషాచలంకొండలు హిమగిరులుగా మారి తుఫాన్‌తో కురిసిన వర్షాలకు కొండల్లోంచి జాలువారే జలపాతాలతో ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం అలముకుంది. ఈ వర్షాలకు కొండలంతా తెల్లని పొగమంచు తెరలనడుమ, చల్లచల్లని మలయవీచికలు గిలిగింతలు పెట్టేలా భక్తులకు కొత్త వాతావరణం తీసుకవచ్చింది. తిరుమలకొండల్లో కురిసిన భారీ వర్షాలకు అవ్వాచారికోన అక్కగార్ల గుడి వద్ద జాలువారే జలపాతం, మొదటి ఘాట్‌లో మాల్వాడిగుండం, కపిలతీర్థం కొండల్లోంచి జాలువారే నీటి సుడులు, సవ్వడులతో భక్తులు ప్రకృతి రమణీయ దృశ్యాలకు పులకించిపోతూన్నారు. భక్తులు కాలినడకన, వాహనాల్లో వచ్చివెళ్లేవాళ్ళు ఫోటోలు దిగి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పచ్చని అందాలతో శేషాచలం కొత్తవాతావరణం అలముకుంది.

### ఉష్ణోగ్రతలు
11/12/2022



- తిరుపతి 24 డిగ్రీలు
- చిత్తూరు 25 డిగ్రీలు
- మదనపల్లి 21 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 24 డిగ్రీలు
- వెంకటగిరి 25 డిగ్రీలు
- గూడూరు 25 డిగ్రీలు

### బంగారం ధరలు
11/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,055
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,515

### కోడిగ్రుడ్ల ధరలు
11/12/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

# నిండిన దొరవారి చెరువు.. మొదలైన మొరవ ప్రవాహం



పెద్దపంజాణి డిసెంబర్ 11 ప్రభాతవార్త :
పెద్దపంజాణి మండలం అప్పినపల్లి-శంకర్రాయలపేట మధ్యఉన్న దొరవారిచెరువు(మాడిచెరువు) పూర్తిస్థాయి జలకలను సంతరించు కుంది. పడమటి మండలాల్లో అతిపెద్దదైన చెరువుల్లో ఈ దొరవారి చెరువు ఒకటి. ఇటీవల మండూస్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో చెరువు పూర్తిస్తాయిలో నిండింది. ఆదివారం చెరువు మొరవ ప్రవాహంప్రారంభమైంది. దీంతో అప్రమత్తమైన తహశీల్దార్ హనుమంతునాయక్, ఎంపీడీఓ భాస్కర్, స్థానిక సర్పంచ్ హరినాథ్‌లతో పాటు అధికారులు హుటాహుటిన చెరువువద్దకు చేరుకుని మొరవ ప్రవాహాన్ని, చెరువు ఆయుకట్టు ప్రాంతాలను పరిశీలించారు. స్థానికంగాకురిసే వర్షాలతోపాటు ఎగువనున్నకర్ణాటకనుంచి సైతం ఈ చెరువుకు వర్షపు నీరు వచ్చిచేరుతుంది దీంతో చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఎగువ ప్రాంతంలో వర్షాలు మరలా మొదలైతే దొరవారి చెరువుకు నీటి ప్రవాహం అధికంగా వచ్చేఅవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇలా జరిగితే దొరవారి చెరువు పూర్తిస్థాయిలో ప్రవహిస్తుంది. ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం సైతం కలుగుతుంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆయుకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. చెరువు కట్ట సైతం బలోపేతంగా ఉందని ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారులు వచ్చి తగు చర్యలు తీసుకుంటారని రైతులకు భరోసా కల్పించారు.

## నా భర్తను కొట్టి తీసుకెళ్ళారు...కాపాడండి మహాప్రభో...!

చౌడేపల్లి, డిసెంబర్ 11 ప్రభాతవార్త
అత్తింటికొచ్చి వెళుతుంటే నాభర్తను కొట్టి లాక్కెల్లారు...కాపాడండంటూ ఓ మహిళ వేడుకొంటోంది...బాధితురాలి కథనం మేరకు...అన్నమయ్య జిల్లా తరిగొండకు చెందిన నీలిమ చిత్తూరు జిల్లా పుంగనూరు తూర్పుమొగసాల యేసుతో 2000సంవత్సరంలో వివాహం చేసుకొంది. వారిద్దరికీ ఇద్దరు మగపిల్లలున్నారు. కుటుంబంలో తరచూ జరుగుతున్న గొడవల కారణంగా నీలిమ 2018లో యేసు నుంచి కోర్టుద్వారా విడాకులు తీసుకొంది. పిల్లలిద్దరూ తండ్రి వద్దనే వుంటున్నారు. ఆ తర్వాత నీలిమ మండలంలోని పుదిపట్ల జి.వెంకటేష్‌ను 3యేళ్ళ క్రితం పెళ్ళి చేసుకొని ఇద్దరూ పలమనేరులో కాపురముంటున్నారు. ఈక్రమంలో ఆదివారం నీలిమ, వెంకటేష్‌లు పుదిపట్లకు వచ్చారు. ఇక్కడు పలు కార్యక్రమాలు ముగించుకొని సాయంత్రం పలమనేరుకు టూవీలర్‌పై బయలుదేరారు. చౌడేపల్లి నుంచి అడవిమార్గంలో పలమనేరుకు వెళుతుండగా మండల పరిధిలోని కుంచినపల్లి వద్ద విడాకులు తీసుకొన్న మాజీ భర్త యేసు, రాజు, ముని మరో 8మందితో తాము వెళుతున్న టూవీలర్‌ను అడ్డుకొన్నారని నీలిమ తెలిపింది. కర్రలతో తమపై ఒక్కసారిగా దాడి చేయడంతో పెద్దగా కేకలు వేసినా ఎవరూ రాలేదనీ, దీంతో తన భర్త వెంకటేష్‌ను చితకబాది మరో స్కూటర్‌పై తీసుకెళ్ళారని ఆమె వాపోయింది. వెంటనే పోలీసులకు తానే సమాచారమిచ్చానని తన భర్తను వారి నుంచి రక్షించాలని వేడుకొంటోంది. బాధితురాలు ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

## తుఫానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జిల్లా అధికారి

పలమనేరు, డిసెంబరు 11 ప్రభాతవార్త:
మాండూస్‌తుఫాను కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి రత్నప్రసాద్ ఆదివారం పరిశీలిం ఛ్రారు. మండలంలోని టి.వడ్డూరు, పెంగరగుంట, కుర్మాయి, కరిడిమడుగు గ్రామాలలో మొక్కజొన్న, వరి, ఉలవ పంటలు తుఫాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతినడంతో అధికారులు ఆ పంటలను పరిశీలించారు. ఈ క్రమంలో జిల్లా అధికారి రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలమనేరుఏడిఏఅన్నపూర్ణాదేవి, ఏఓసంధ్య, రైతుభరోసాసిబ్బంది సింధు పల్గొన్నారు.

## తెదేపా నేత హనుమంతు గౌండర్ మృతి .. చంద్రబాబు సంతాపం

కుప్పంరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త
రామకుప్పం మండలం వీర న్నమలకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత హనుమంతు గౌండర్ మృతి చెందారు. ఈయన మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. హనుమంతు గౌండర్ ఆత్మకు శాంతికలగాలని వారి కుటుంబం త్వరగా కోలుకోవాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పింఛన్ల సొమ్ము రూ.ఆరువేలకు పెంచాలి



కుప్పంరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త
రాష్ట్రంలో ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అందిస్తున్న వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళల పింఛన్ల సొమ్మును ఆరువేలకు పెంచాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా కో కన్వీనర్ ప్రకాష్, ఎంఎస్ఎఫ్ నేత సురేష్, రాజేష్‌లు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో మండలంలోని బోదగుట్టపల్లి గ్రామంలో వారు సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని నివేదిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నేత దేవరాజు, వెంకటప్ప, కృష్ణప్ప, శీనప్ప, మునివెంకటమ్మ, కదిరమ్మ, ఓబులమ్మ పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి

కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గంలో తుఫాను ప్రభావం, చల్లటి ఉష్ణోగ్రతల వల్ల ఉద్యానవన పంటలు దెబ్బతినకుండా రైతులు తగు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన అధికారిణి డింపుప్రియశ్రీ పేర్కొన్నారు. అరటి, బొప్పాయి, పూలు, కూరగాయల పంట పొలాలనుంచి నీటిని వెంటనే తొలగించాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే పాలీఫీడ్ లేదా మల్టీకె ఐదునుంచి ఏడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బంగాళాదు ంప, టమోటా పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఆలియెట్, ఆంట్రాకోల్ రెండు గ్రాముల వంతున కలిపి పిచికారీ చేయాలన్నారు. కుప్పం ప్రాంతంలో మాండస్ తుఫాను ప్రభావంతో సుమారు పది ఎకరాల్లో పంట నష్టం కలిగినట్లు నివేదికలు అందాయని క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి పంటనష్టం అంచనా వేయడ ం జరుగుతుందన్నారు.

## తుఫాను బాధితులకోసం సహాయ శిబిరం

శాంతిపురం, డిసెంబర్11 ప్రభాతవార్త
మాండస్ తుఫాను నేపథ్యంలో మండలంలోని జంగాలపల్లి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రజల కోసం జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్థానిక పాఠశాలలో సహాయ శిబిరం ఏర్పాటుచేశారు. తుఫాను ప్రభావంతో 17 ఇళుల దెబ్బతిన్న నేపథ్యంలో కాలనీలో ఉంటున్న 60మందికి భోజనం, వైద్య సౌకర్యాలను అధికారులు కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, జడ్పీటిసి శ్రీనివాసులు, సర్పంచ్ చౌడమ్మ చిన్నప్ప, వైస్ ఎంపిపి పట్టాభి, తహశీల్దార్ లోకేశ్వరరావు, డిటి ఫైజుల్లా, ఆర్ఐ మధుసూధన్, విఆర్వో ఆదిమూర్తి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం సంకటహరచతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం నుండి సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ అలంకార మండపంకు తీసుకువచ్చి వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు ఆర్ధికసాయం



పాలసముద్రం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
మాండూస్ తుఫాను ప్రభావంతో నిరాశ్రయులై పునరావాస కేంద్రాల్లో తలదాచుకొన్న బాధితులకు ఆదివారం ఒకొక్క కుటుంబానికి తహసిల్దారు బాబు 2 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయంను అందించారు. ఈ సందర్భంగా తహసిల్దారు బాబు మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో తల దాచుకొన్న వారికి ప్రభుత్వం ఒకొక్క కుటుంబానికి 2 వేల రూపాయలు మంజూరు చేసిందని ఈ మేరకు పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రంలో పునరావాసం పొందిన 20 మందికి 40 వేల రూపాయలు అందించినట్లు పేర్కొన్నారు. ఇందులో గిరిజన కుటుంబాలకు చెందిన వ్యక్తులు 14 మంది వుండగా వనదుర్గాపురం పంచాయతీకి చెందిన కుటుంబాలు 4 వున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విద్యావతి, ఎంపిపి శ్యామల, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, జడ్పీటిసీ అన్బుగలన్, సర్పంచ్‌లు అయ్యప్పన్, నరసింహరాజు, నాయకులు శివప్రకాష్, వీఆర్‌ఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## యధావిధిగా స్పందన

చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
జిల్లా సచివాలయంలో సోమవారం యధావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ హరినారాయణన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలను తీసుకొని జిల్లా సచివాలయంలో తనను కలిసి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో తనతో పాటు జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారన్నారు.

## 'ఇదేం ఖర్మ' రాష్ట్రానికి అంటున్న టిడిపి

చిత్తూరురూరల్, డిసెంబరు 11 ప్రభాతవార్త:
చిత్తూరు మండలం తుమ్మిందపాళ్యం గ్రామంలో ఆదివారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే బాదుడే బాదుడు అంటూ ప్రజల్లోకి వెళుతున్న తెలుగుదేశం తాజాగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముందుగా విఘ్నేశ్వరుని ఆలయం నందు పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో పరిస్థితులు, కాజధానుల పేరుతో మూడు ముక్కలాట, ఆకాశంలో ధరలు, నిరుద్యోగ యువత, గిట్టని గిట్టుబాటు ధరలు రైతన్నల ఆత్మహత్యలు, ప్రజలకు ఎదురవుతున్న ప్రధానమైన సమస్యల గురించి వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శశికర్‌బాబు, మాజీ వైస్ ఎంపిపి రాజేంద్ర, మండల తెలుగుయువత ప్రధాన కార్యదర్శి గురేష్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీలకు టార్బాలన్ పట్టలు పంపిణీ

చౌడేపల్లి, డిసెంబర్ 11 ప్రభాతవార్త
గుడిసెల్లో నివసించే ఎస్టీలకు తహశీల్దార్ మాధవరాజు తన సొంత నిధులతో టార్బాలిన్ పట్టలనందించారు. శెట్టిపేట పంచాయతీ గౌనివారిచెరువు, పందిళ్ళపల్లి పంయచాయతీ తామరాకులొడ్డు గ్రామాల్లో గుడిసెలు, అడ్డపిళ్ళల్లో నివసించే వారిరందికీ పట్టలతోపాటు ఆహారవసతి కల్పించారు. మాండూస్ తుఫాన్ కారణంగా మేకలచిన్నేపల్లి ఉన్నతపాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఎంపిడిఓ సుధాకర్, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచు ఓబుల్‌రెడ్డి, ఆర్.ఐ సుధాకర్‌నాయక్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా మళ్ళీ రాఘవులు ఏకగ్రీవం



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా మళ్ళీ రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఎన్.రఘు ఎన్నికయ్యారు. జిల్లా ఎన్జీఓ సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఎన్జీఓ సంఘ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా వైఎస్ఆర్ కడప జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా ప్రస్తుతం వ్యవహరిస్తున్న రాఘవులు మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జెడి కార్యాలయంలో సూపరిటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవులు ప్యానెల్ మరోసారి జిల్లా ఎన్జీఓ సంఘంలోని 14 పదవులకు నామినేషన్లు దాఖలు చేసింది. ఈ క్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు రాఘవులు మరోసారి పోటీ చేయడానికి అధ్యక్షుడిగా నామినేషన్ దాఖలు చేయడంతో పాటు తన ప్యానెల్‌కు సంబంధించి 14 మంది అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ప్రస్తుత అధ్యక్షుడు రాఘవులు ప్యానెల్‌పై పోటీ చేయడానికి ప్రత్యర్థులు ఎవరు నామినేషన్లు దాఖలు చేయక పోవడంతో జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా మరో సారి రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో జిల్లా ఎన్జీఓ సంఘ అసోసియేట్ అధ్యక్షుడిగా పిబి మురళీకృష్ణ(జిల్లా వైద్య ఆరోగ్యశాఖ), ఉపాధ్యక్షులుగా బాలసుబ్రమణ్యం(సబ్ ట్రెజరీ కార్యాలయం, బంగారుపాళ్యం), వై.లక్ష్మీపతి (పంచాయతీ రాజ్‌శాఖ, పలమనేరు), ఎన్‌వి వరప్రసాద (తిరుపతి రుయా ఆసుపత్రి), టిఎన్.పురుషోత్తం రెడ్డి(రవాణాశాఖ, పుంగనూరు), విఎస్ రెడ్డిప్పయన్ (తహసిల్దారు కార్యాలయం, కార్వేటినగరం), ప్రధాన కార్యదర్శిగా విజి రఘు(జిల్లా వ్యవసాయ శాఖ, చిత్తూరు), కార్యనిర్వాహకకార్యదర్శిగా ఎస్‌జె ప్రదీప్ కుమార్(ప్రభుత్వఐటిఐ, చిత్తూరు), సంయుక్త కార్యదర్శులుగా కె.రమేష్(ఎకనామికల్ అండ్ స్టాటిస్టికల్ కార్యాలయం, చిత్తూరు), ఎంబి మహేష్‌కుమార్ (పిహెచ్‌సి, తూగుండ్రం), సురేష్‌కుమార్(ఆర్ అండ్‌బి, చిత్తూరు), సురేష్(పట్టుపరిశ్రమల శాఖ, చిత్తూరు), మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా ఎన్ఎం సునీత(పిహెచ్‌సి, రేగల్లు, పీలేరు మండలం), కోశాధికారిగా మురళీమోహన్(జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జిల్లా ఎన్జీఓ సంఘ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారు మూడేళ్ళ పాటు కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతారని ఎన్నికల నిర్వహణ అధికారి, వైఎస్ఆర్ కడప జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చేనిగుంట, గ్రద్దగుంటలలో మాజీమంత్రి పరసా పర్యటన

తడ, డిసెంబర్ 11 ప్రభాతవార్త
మాండోస్ తుపానుతో మునిగిన వరిపంటను మాజీమంత్రి పరసా రత్నం ఆదివారం సాయంత్రం పరిశీలించారు. తడ మండలం చేనిగుంట, గ్రద్దగుంట గ్రామాల్లో ఆయన రైతులతో కలిసి పంట పొలాల వద్దకు వెళ్లారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా పరసా తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి రైతుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్రత్యేక బృందాలను పంపించి పంట నష్టంపై అంచనాలు వేయాలని, నష్టపరిహారం చెల్లించి చైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రెండు గ్రామాలు మాత్రమే కాకుండా వరద ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలు వేలాది ఎకరాల్లో ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## తుపానులోనూ కష్టపడిన ట్రాన్స్‌కో సిబ్బంది



తడ, డిసెంబర్ 11 ప్రభాతవార్త
మాండోస్ తుపాను ప్రభావంతో తడ మండల పరిధిలోని పలు తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే సిబ్బంది వర్షంలోనూ, చీకట్లోనూ పనిచేసి విద్యుత్ సరఫరానుపునరుద్ధరించారు. మండల పరిధిలో 20కి పైగా స్తంభాలు పడిపోయాయని, నాలుగుట్రాన్స్ ఫార్మర్లుదెబ్బతిన్నాయనిసంబంధితఏఇ మురళీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము విద్యుత్ సరఫరాను పునరుద్దరించినట్లు తెలిపారు. రెండురోజులుగా గాలివాన ఉన్నప్పటికీ కేవలం ఒక్కరోజు రాత్రి మాత్రమే మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేకచోట్ల వెంటనే పునరుద్ధరించడం పట్ల పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కువ పరిశ్రమలు, పులికాట్‌తీరగ్రామాలుఉన్నాయి. వీటన్నింటికీసరఫరానుఇవ్వడంలో విద్యుత్‌శాఖ సిబ్బంది కృషి ఫలించింది.

## తుపాను ప్రభావంతో రైతులకు తీవ్ర పంట నష్టం

కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
తుపాను ప్రభావంతో గత మూడు రోజులగా భారీ వర్షాలకు కోట మండలం రైతులకు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా వరి నారుముళ్ల నీటి మునిగిపోయాయి. అల్లంపాడు, వంజివాక, కర్లపూడి, సిద్దవరం, తిన్నెలపూడి, చెందోడు, ఊనుగుంటపాళెం, రుద్రవరం, చిట్టేడు, కేశవరం, మద్దాలి, తదితర గ్రామాల్లో వరినాట్లు కూడా నీటి మునిగాయి. రైతులు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆరుగాలం శ్రమించి పంట పొలల్లో వరి నట్లు వేసుకున్నారు. మండో్ తుపాన్ కారణ:గా భారీ వర్షాలు కురవడంతో రైతులు కన్నీటి పర్వతమవుతూన్నరు. తామను ప్రభుత్వం ఆదుకొవాలని కోరుతున్నారు.

## తుఫాను నష్టాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా

వెంకటగిరి, డిసెంబరు 11, ప్రభాతవార్త:
తుఫాను కారణంగా వెంకటగిరి పట్టణంలో జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే ఆనం నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. తుఫాను కారణంగా వెంకటగిరి పట్టణంలోని రోడ్డు, చేనేత కార్మికులు నష్టపోవడంతో ఆమె పర్యటించి పరిశీలించారు. ఆరో వార్డు ఎన్టీఆర్ కాలనీలో నీటి ప్రవాహానికి రోడ్డు గురి కావడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చేనేత కార్మికుల మగ్గాలు పంటల్లో నీరు చేరాయని తెలిపారు. నష్టాల అంచనాలు తయారు చేయాలని అధికారులకుసూచించారు. ఆమెవెంటపద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను నష్టాలను పరిశీలించిన అధికారుల బృందం



బాలాయపల్లి, డిసెంబరు 11, ప్రభాతవార్త:
మండలంలోని వాక్యము, కడగుంట, రామాపురం గ్రామాల్లో తుఫాను వలన కలిగే నష్టాలను తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో వినీల్‌కుమార్‌లు పరిశీలించారు. కోతకు గురైన రోడ్లను వెంటనే బాగు చేయించారు. కల్వర్టులలో ఇరుక్కునిఉన్నచెత్తాచెదారాన్నిజేసీబీద్వారాతొలగించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయిం చారు. తుఫాను నష్టాల వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్ తెలిపారు.

## వెంకటగిరి ఎస్ఐగా జిలానీబాషా



వెంకటగిరి, డిసెంబరు 11, ప్రభాతవార్త:
వెంకటగిరి ఎస్ఐగా జిలానీబాషా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న కోటిరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. పట్టణంలో ట్రాఫిక్, ఈవ్‌టీజింగ్, చోరీల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

# ముంపుకు గురికాకుండా శాశ్వత పనులను చేపట్టండి



వాకాడు, డిసెంబర్ 11, ప్రభాతవార్త
మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మండలంలోని ముంపుకు గురైన ముట్టింబాక దళితవాడను గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ మండల స్థాయి అధికారులు, స్థానిక నేతలతో పరిశీలించారు. ముట్టింబాక గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్ రెడ్డి ఆర్డీవోకు తెలియజేస్తూ కొద్దిపాటి వర్షాలకి రోడ్లు జలమై అవుతున్నాయని, తుఫాను ప్రభావంతో వరదలు వచ్చినప్పుడు ముట్టింబాక గ్రామం జల దిగ్బంధంలో ఉండిపోతున్నామని వాపోయారు. అదే విధంగా వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోధర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలతో పాటు తీర ప్రాంత గ్రామాల్లో కూడా తుఫాను తాకిడికి గానీ, భారీ వర్షాలకు గాని వరదలు సంభవించినప్పుడు ముంపు గురికాకుండా శాశ్వతమైన చర్యలు చేపట్టాలని ఆర్డీవోకి ఆయన సూచించారు. అప్పటికే సర్పంచ్ అనిల్ కుమార్ రెడ్డి ముట్టంబాక గ్రామంలోని పేద బడుగు బలహీన వర్గాలకు తన వంతు కృషి చేస్తూ, సహాయ సహకారాలు అందిస్తున్నారని స్థానిక ప్రజలు ఆర్డీవోకి సూచించారు. ఆర్డీవో కిరణ్ కుమార్ రెడ్డి స్పందించి మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందేలా చూస్తానని తుఫాను బాధితులకు ఆయన భరోసా ఇచ్చారు. సర్పంచ్ అనిల్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన భోజనమును ఆర్డిఓ కిరణ్ కుమార్ రెడ్డి, ఎంపిడిఓ గోపినాథ్, దామోధర రెడ్డిలు వారి చేతుల మీదుగా బాధితులకు భోజనం అందించారు. అనంతరం వాకాడు బ్యారేజ్, గంగన్న పాలెం పొర్లు కట్లను ఆయన పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఇన్చార్జి డిప్యూటి తహశీల్దార్ సారంగపాణి, సర్పంచుల సంఘం అధ్యక్షులు విజయ్ భాస్కర్ రెడ్డి, స్థానిక నేతలు మధుసూధన్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మళ్లీ రుద్రవరం రోడ్డుకు గండ్లు

– రాకపోకలకు అంతరాయం



కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కోట మండలంలో మాండోస్ తుపాను అతలాకుతలం చేసింది. ఈదురు గాలులతో పాటు భారీవర్షం కురిసింది. శ్యామసుందరపురంలో ఓ పూరిల్లు కుప్పకూలింది. పలుచోట్ల ఆర్‌అం డ్‌బీ రహదారులకు గండ్లు పడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి. మండలంలోని ఊనుగుంటపాలెం-రుద్రవరం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారికి పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. గత సంవత్సరం ఇదే ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రహదారికి గండ్లు పడటంతో ఓ కాంట్రాక్టర్ 15 లక్షలు ఖర్చు చేసి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అయినా నేటికీ ఆ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ఇంతవరకు బిల్లు చెల్లించలేదు. ప్రస్తుతం అదే ప్రాంతంలో మళ్లీ గండ్లు పడటంతో ఆ రెండు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం, ఊనుగుంటపాలెం, చిట్టేడు, గూడలి గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైగావరినాట్లు, నారుమడులు నీట మునిగాయి. మండలంపై మాండోస్ తుపాను తీవ్ర ప్రభావం చూపింది.

## ఆక్రమణల తొలగింపుపై అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేయండి



– ఆర్డీఓ కిరణ్‌కుమార్
కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
ఆక్రమణల తొలగింపుపై అన్ని పార్టీలతో అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కోటలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట పట్టణంలోని ప్రధాన రహదారి ఆక్రమణల తొలగింపునకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. అధికారులు అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అందరి అభిప్రాయంతోనే ఆక్రమణల తొలగింపు చేపడతామన్నారు. అప్పటికీ ఆక్రమణదారులు సహకరించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణల తొలగింపుతో రోడ్డు విస్తీర్ణం పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదని తెలిపారు. అంతకుముందు పునరావాస కేంద్రంలో దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తుపాను సహాయక చర్యల్లో అధికారుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని తదితరులు ఉన్నారు.

## మండలంలో 2200 ఎకరాల పంట నష్టం



వాకాడు, డిసెంబర్ 11, ప్రభాతవార్త
మాండూస్ తుఫాన్ ప్రభావంతో వరదలు సంభవించడంతో మండలంలోని ఇప్పటి వరకు 2200 ఎకరాలు పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారిని దీప తెలిపారు. ఆదివారం మండలంలోని ముంపుకు గురైన ముట్టెంబాక, వాకాడా ఏరియాలో మునిగిపోయిననారు ముడులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ వర్షాలు పూర్తిగా ఆగిపోయి నప్పుడు పూర్తి స్థాయిలో పంట నష్ట గణన చేపడతామన్నారు. ఇప్పటివరకు మండలంలోని 2200 ఎకరాలుపంట మునిగినట్లు తెలిపారు. ఆమె వెంట లక్ష్మయ్య, సుబ్రమణ్యం, రైతుల తదితరులు ఉన్నారు.

## బాధితుడికి ఆర్థిక సహాయం

కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కోట పంచాయతీ శ్యామసుందరపురంలో రామకృష్ణ అనే వ్యక్తి పూరిల్లు మాండోస్ తుపాను కారణంగా గాలులకు కుప్పకూలింది. ఈ నేపథ్యంలో బాధితుడి కుటుంబం నిస్సహాయస్థితికి చేరుకుంది. సమాచారం తెలుసుకున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆదివారం బాధితుడికి రూ.5 వేలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. త్వరలోనే పక్కాగృహం మంజూరు చేస్తామని తెలిపారు. ఆర్డీఓ వెంట తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, ఆర్‌అండ్‌బి డిఇ అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోటలో ప్రవాస యోజన కార్యక్రమం



కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
రాష్ట్ర వ్యాప్తంగా మూడురోజుల పాటు 11, 12, 13 తేదీల్లో జరిగే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోటలోని బీజేపీ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా కార్యదర్శి భైరప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి చేయడం, స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ ప్రవాస యోజన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో భాగంగా మండలంలో బీజేపీని ఏ విధంగా బలోపేతం చేయాలన్నదే కార్యక్రమం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు, ఎస్ అంబరిష్, వాసు, సుబ్రహ్మణ్యం, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి రోజా



నాయుడుపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహ పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె రోజా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే సంజీవయ్య, ఆయన సతీమణి సుభాషిణిలతో మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడారు. ఆదివారం నాయుడుపేటలోని ఒక కల్యాణ మండపంలో సౌజన్య, శ్రావణ్‌కుమార్‌ల వివాహ పరిచయ కార్యక్రమా న్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీన నెల్లూరులో వీరి వివాహం ఘనంగా జరిగింది. మంత్రి రోజాతో పాటు తిరుపతి, గూడూరు ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాద్‌లతో పాటు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, వైసీపీ నేత మేరిగ మురళీధర్, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను అభిమానులు, వైసీపీ కార్యకర్తలు చుట్టుముట్టి సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

## తుఫాను బాధితులకు రొట్టెల పంపిణీ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త



మాండోస్ తుఫాను బాధితులకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలోఈశ్వరయ్య గిరిజన కాలనీ వాసులకు మరియు విద్యార్ధులకు రొట్టెలను పంపి ణీ కార్యక్ర మాన్ని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గోపి, సురేష్, ముని రాజ, మస్తాన్, వెంకటరమణ, గంగమ్మ, భవానీ, చెంచమ్మ, సుబ్బమ్మ, లక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు ఇచ్చి..బదిలీ చేసుకో సామీ!

శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త



భావితరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో అకుంఠిత దీక్షతో పనిచేసే ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ లోకానికి సరిగ్గా ముప్పై రోజులుకు జీతాలు ఇచ్చి, తర్వాత బదిలీలు చేసుకుంటే సబబుగా ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి తెలుగునాడు విద్యార్ధి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు హితవుపలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబందించిన అర్ధసంవత్సర పరీక్షలు మరికొన్ని రోజుల్లో ప్రారంభం అవుతుండగా ప్రస్తుతం బదిలీల షెడ్యూలు ప్రకటించడం అసంబద్ధమైన చర్యగా భావించారు. నెలంతా కష్టపడి నెలాఖరున జీతం కోసం ఎదురుచూసే ఉద్యోగికి నలభై రోజులైనా తన కష్టార్జితం చేతికి అందకుండా అవస్థలు పడుతుంటే ఉపాధ్యాయ వర్గాల బదిలీలప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించిన జగన్‌రెడ్డి చర్యలను చూసి నవ్వాలో, ఏడవాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉద్యోగ వర్గాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఉపాధ్యాయ వర్గాలలో గందరగోళం సృష్టించడం మానుకుని విద్యారంగాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండేలా చర్యలుతీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మద్యపానం..మాదకద్రవ్యాలు తప్ప అభివృద్ధి లేదు?

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఏరులా పారుతున్న మద్య పానం, మరోవైపు యువతను మాదకద్రవ్యాలతో తప్పుదారి పట్టించడం తప్ప రాష్ట్రంలో అభివృద్ధి ఏమి లేదని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి తెలిపారు. 'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగా ఏర్పే డు పంచాయతీలో కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈసంద ర్భంగా రెడ్డివారిగురవారెడ్డి మాట్లాడుతూ మూడున్నరేళ్ళ వైకాపా పాలనలో నిరుద్యోగ సమస్య, మద్యపానం, మాదకద్రవ్యాలు పెచ్చుమీరడం, ఇసుకమాఫియా, తాగునీటి సమస్య, అవినీతి, మహిళలకు భద్రతలేకపోవడం, కరెంటు ఛార్జీలు, గ్యాస్‌ఛార్జీలు పెంచడం వంటివి నేటి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విదానాలను ప్రజలకు వివరింవచారు. నిలకడలేని పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ప్రత్యేకంగా రూపొందించిన పాంప్లేట్‌లో 9261292612 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయిస్తూ అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్‌ఏగా బొజ్జలసుదీర్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, స్థానిక గ్రామ కమిటీ నిరంజన్, పార్లమెంటు బిసి ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, యువతనాయకుడు మునీంద్ర, నాయకులు వెంకటకృష్ణమనాయుడు, వెంకటరమణ, గుణశేఖర్, వనమ్మ, వెంకటముని, మునిచంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నెలవుగా సత్యవేడు రోడ్లు..

సత్యవేడు, డిసెంబర్ 11, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని రోడ్లు అధ్వాన స్థితికి చేరుకోవడంతో రోడ్లు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయని ప్రజలు,వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ గ్రావేల్ క్వారీ లారీల రాకపోకలు ఎక్కువ కావడంతో రోడ్లు దెబ్బతిన్నట్లు తెలుస్తుంది.దాంతోపాటుగా వర్షాలు కారణంగా రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు తరచుగా రోడ్డు ప్రమాదాలకు గురౌతు న్నారు.మండలంలోని రాజగుంట,వేంకటరాజుల కండ్రిగ వద్ద ఉన్న కల్వర్టులు కూడా ఈ గ్రావేల్ క్వారీల పుణ్యమాఅని దుస్థితికి చేరుకున్నాయి. అలాగే సత్యవేడు వయా మాదరపాకం పోవు మార్గంలో పాత చెక్‌పోస్ట్ వద్ద అయితే రోడ్లపై భారీ గుంతలు ఏర్పటంతో వాహనదారులు,పాదచారులు తీ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోడ్ల దీనస్థితిలో ఉన్నా అధికారుల చర్యలు లేకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఇక్కడి రోడ్ల దుస్థితిపై దృష్టి సారించి రోడ్లకు మరమ్మత్తు చర్యలు చేయాల్సి న అవసరం ఉంది.అదికగా ప్రజా సమస్యలపై స్థానిక పాలకులు కూడా చొరవచూపి పరిష్కార మార్గాలను చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## మను బేకర్స్‌ను ప్రారంభించిన రాస్ వెంకటరత్నం

తిరుపతి నగరం, డిసెంబరు 11 ప్రభాతవార్త ః

స్థానిక డీఆర్‌మహల్ రోడ్డులో ఆదివారం మను బేకర్స్‌ను రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన అన్ని రకాల బేకరీ ఐటమ్స్ సరసమైన ధరలకు అందుబాటులో అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మను బేకర్స్ మేనేజింగ్ పార్టనర్స్ స్వాతి చౌదరి, మనోహర్ నాయుడులను అభినందించారు. అన్ని రకాల శుభకార్యాలకు పండుగలకు అవసరమైన సరికొత్త వైరేటీలతో నాణ్యమైన కేక్ ఐటమ్స్‌ను అందుబాటులో ఉంచామని నగర ప్రజలు యువత, మహిళలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మేనేజింగ్ పార్టనర్స్ స్వాతి చౌదరి, మనోహర్ నాయుడులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత ఎస్.కె బాబు, తిరఉపతి కోఆపరేటివ్ బ్యాంకు మాజీ ఛైర్మన్ నరసింహ, స్థానిక ప్రజలు, పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో భయపెట్టలేరు - తెదేపా నేతలు

- రామకుప్పం పోలీస్ స్టేషన్‌లో సంతకాలు !!

కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించి భయపెడితే భయపడేది లేదని కుప్పం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, తెదేపా జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి మంజునాథ్, మండల తెలుగుయువత అధ్యక్షుడు సుబ్బు పేర్కొన్నారు. ఆదివారం వీరు రామకుప్పం పోలీస్‌స్టేషన్‌కు హాజరై అక్కడ సంతకాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆగస్టు నెలలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా తమపై అక్రమ కేసులు బనాయించారన్నారు. నెలరోజుల పాటుచిత్తూరు జైలులో ఉండి బెయిల్‌పై విడుదల అయ్యామన్నారు. అయితే ప్రస్తుతం ప్రతి నెలలో రెండు ఆదివారాలు రామకుప్పం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెడుతున్నామన్నారు. తమ లాంటి కష్టం మరెవరికీ రాకూడదన్నారు. తమపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టిన వారికి, అధికార పక్షానికి 2024లో తగు గుణపాఠం చెబుతామన్నారు.

## టిపిపిఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తిరుపతి విద్య, డిసెంబర్ 11, ప్రభాతవార్త

టంగుటూరి ప్రకాశం పంతులు హైస్కూల్‌లో 83-84 బ్యాచ్ పదవ తరగతి చదివిన విద్యార్ధులంతా ఆదివారం స్కూల్ ప్రాంగణంలో కలిశారు. 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చిన్ననాటి స్నేహితులంతా ఒక చోటు చేరి చిన్న నాటి జ్ఞాపకాలను విద్యా బుద్ధులు నేర్పిన గురువుల తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. టిపిపిఎం హైస్కూల్‌లో చదివిన చిన్ననాటి మిత్రులంతా కూడా వివిధ రంగాలలో తాము నిర్వర్తిస్తున్న బాధ్యతల గురించి కుటుంబ సభ్యుల వివరాలను ఒకరికి ఒకరు తెలియజేస్తూ ఆనందంగా గడిపారు. అనంతరం చిన్న నాటి స్నేహితులకు అత్యవసరంగా ఏదైనా ఆర్థిక ఇబ్బందులు వస్తే ఆదుకునేందుకు ఫండ్ రైజింగ్‌కు శ్రీకారం చుట్టారు. స్కూల్ ఆవరణంలో మధ్యాహ్నం భోజనాలుచేసిఉల్లాసంగాఉత్సాహంగాగ్రూప్‌ఫోటోలుదిగితమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలాగే ఆలయంలోని పరివార దేవతలైన సూర్య భగవానుడు సుబ్రహ్మణ్యస్వామికి కూడా అభిషేకాలు అలంకరణలు చేశారు. సాయంత్రం కలశ స్థాపన విఘ్నేశ్వర పూజ గణపతి హోమం కార్యక్రమా లను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే బజారు వీధిలో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కూడా సంకటహర చతుర్థి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం..మాజీ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త



శాకాహారంతోనే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు అన్నారు. ఆదతివారం బ్రహ్మర్షి పితామహ పత్రిజీ ఆశయ సాధనలో భాగంగా ఏడుగంగమ్మల జాతరను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం శాఖాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్ఏ, ప్రముఖ ఆద్యాత్మిక వేత్త ఎస్సీవీనాయుడు విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ ప్రతి మనిషి శాకాహారి కావడంతో పాటు, ధ్యానం అలవాటు చేసుకుని తనను తాను తెలుసుకుని జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. ఆహార నియమాలు మారితే మనిషిలో మార్పు వస్తుందని అనంతరం 30మంది స్కౌట్స్ విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తిలో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లతో పొన్నాలమ్మ ఆలయం నుంచి నాలుగుమాడవీధులుగా ర్యాలీ శ్రీకాళహస్తి ఆలయం వద్దకు చేరుకుంది. ర్యాలీలో ధ్యాన మహిళలు నిర్వహించిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## తేదేపా నాయకులకు సత్కారం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త

పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, పట్టణ యువత అధ్యక్షుడు మరియు మాజీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పార్టీలో చేరిన కాసరం రమేష్, వజ్రం కిషోర్, తొండంబట్టుశ్రీనులను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి మరియు వైకాపా పార్టీలో నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరధాచారి, రాష్ట్ర మాజీ టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి మరియు రాష్ట్ర బిసి జెఏసి కార్యదర్శి ఉమేష్‌రావు, పార్టీ బిసి సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, బిసిసెల్ పట్టణ అధ్యక్షులు పోలూరుశ్రీనివాసులురెడ్డి, మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మన్ డి.వి.నారాయణ, తొట్టంబేడు నాయకులు సునీల్‌కుమార్, భాస్కర్, మణి, ఆర్‌కెరామకృష్ణ, ఐటిడిపి అధ్యక్షులు ఖాదర్‌బాషా, రాష్ట్ర యువత కార్యదర్శి ప్రవీణ్‌చౌదరి మరియు నాయకులు పాల్గొన్నారు.

## బేరివారి మండపానికి ఆధ్యాత్మిక శోభ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న మండపాలు, అనుబంధ ఆలయాలకు పూర్వవైభవం కల్పించుటకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆదివారం బేరివారి మండపానికి ఆధ్మాత్మిక శోభను కల్పించుటకు ప్రణాళికలు రూపొందించినట్లు నిర్వాహించారు. శ్రీకాళహస్తిలో స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణకు వెళ్ళి ముందు ఆయా మండపాలలో కొలువుదీరి భక్తులకు అనుగ్రహిస్తారనే నమ్మకం ఉంది.ఈ మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోనూ పరిసర కొండల్లో మండపాలను ఆయా కులాల సారధ్యంలో ఆదునీకరకరణకు కొరగా దేవస్థానం చొరవ చూపుతుందన్నారు. పురాతన కాలం నాటి మండపాలు దెబ్బతినటంతో వాటిని ఆధునీకరించటంకు చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణంలోని బేరివారి మండపం ఆధునీకరించానికి చర్యలు తీసుకున్నామన్నారు.ఈ పనులకు ఆదివారం భూమి పూజలు చేసి శ్రీకారం చుట్టారు. ఇక్కడ వ్యాపార సంస్థలు తొలగించి మండపం పై బాగంలో నందులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.మరమ్మత్తులను బేరివారి సంఘం చర్యలు తీసుకుంటుందన్నారు.ఈ కార్యక్రమాల్లో బేరివారి సంఘ నాయకులు బి.వి.రవీంద్రన్, పిజి ఆర్ముగం, చెంచుపుల్లయ్య, బాలాజి, గిరిధర్, వక్కడ బాలసుబ్రమణ్యం,జైలక్ష్మీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విరాళం అందుతున్నాయి.ఈ నేపధ్యంలో ఆదివారం నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తి మండలం గంగల పూడి గ్రామానికి చెందిన వెంకటరావు పేరు మీద కుమారుడు తులసీరామ్ రూ.10, 116లు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందించారు. వారికి ప్రత్యేక దర్శనం,శేష వస్త్రాలను అందించారు.

## దక్షిణకాళికాదేవికి విశేషపూజలు

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త



మండలంలోని వేడాం గ్రామంలోని కైలాసగిరిపర్వ తపం కుల్లోవెలసిన దక్షిణకాళికామాత ఆలయంలో ఆదివారం భక్తజన సందడిచోటుచేసుకుంది. ఈసంద్భంగా ఆలయం లో వెలసిన అమ్మవారికి విశేష అభిషేకాలను వివిధ రకాలైన చందనం, పెరుగు, కొబ్బరినీళ్ళు, పసుపు, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం అలంకరణ చేపట్టారు. అమ్మవారి సేవలో పట్టణం నుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక ప్రాంతాల నుంచి విచ్చేన భక్తులు పాల్గొన్నారు.

# ఎంజీకార్ కేర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమన

తిరుపతి నగరం, డిసెంబరు 11 ప్రభాతవార్త ః

శ్రీవారి పాదాల చెంత స్థానిక ఎయిర్‌బైపాస్‌రోడ్డు-చిల్లీస్ రెస్టారెంటు ఎదురుగా ఎన్‌వోఎస్2 వారి ఎంజీకార్ కేర్‌ను ఆదివారం ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి,మేయర్ డాక్టర్ శిరీషా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారితో పాటు చిల్లీస్ రెస్టారెంట్ అధినేత చిల్లీస్ అంజి, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, 13వ వార్డు మెంబరు ఆంజనేయులు, వైసీపీ నేత ఎస్.కె బాబులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మొట్టమొదటగా తిరుపతిలో



ఎన్‌వోఎస్2 వారు ఎంజీకార్ కేర్ షోరూంను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఎంజీకార్ కేర్ ప్రొపైటర్ ఆర్.గోపినాథ్, సతీమణి ఇందుమతి మాట్లాడుతూ చెన్నై, బెంగుళూరు రాష్ట్రాల్లో ఈ సౌకర్యం ఉందని, అయితే ఏపీ ప్రజలకు, ఉమ్మడి చిత్తూరు, తిరుపతిజిల్లాలు ప్రధానంగా తిరుపతినగర ప్రజలను దృష్టిలో ఉంచు కుని ఎన్‌వోఎస్ 2 వారి ఎంజీకార్ కేర్ ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్‌వో వాటర్ ద్వారా తక్కువ ధరలకే కార్లు, జీపులు, స్కూటర్లను క్లీన్ చేయడం ద్వారా వాహనాల జీవిత కాలం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ

: మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్

నారాయణవనం, డిసెంబర్ 11 ప్రభాతవార్త :



రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీ ఊపు వస్తోందని మాజీ కేంద్రమంత్రి, తిరుపతి మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. ఆదివారం భారత్ జోడో యాత్రలో భాగంగా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గోవిందప్పనాయుడుకండ్రిగ దళితవాడలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పాలనలో దళితులకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే విద్యుత్ సౌకర్యం, రైతులకు రుణమాఫీ, సబ్సిడీ విత్తనాలు పంపిణీ, ఇంటి స్థలాలు పంపిణీ, ఇందిరమ్మగృహాలు, నిరుద్యోగులకు ఉపాధి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌తో ఎంతో మంది పేదలు ధనవంతులు అయ్యారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డుల పంపిణీ పేదలకు ఫించన్ల పెంపు, 350 రూపాయాలకే గ్యాస్ కనెక్షన్, రేషన్ బియ్యం పంపిణీ, నిత్యవసర ధరల తగ్గుదల, ప్రాజెక్టుల నిర్మాణాలు, ఉపాధిహామి పనులు వంటి అనేక రకాల కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. దళితులకు భూపంపిణీ కాంగ్రెస్ ఘనత అన్నారు. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కోసం ఓట్లు వేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయనకు జిఎన్‌కండ్రిగలో దళితులు ఘన స్వాగతం పలికారు.

## భారీ వర్షానికి తెగిన తుంబూర్ కాజ్‌వే

-గ్రామాల మధ్య ఆగిన రాకపోకలు..!

నారాయణవనం, డిసెంబర్ 11 ప్రభాతవార్త :



గత నాలుగు రోజులుగా ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో తుంబూరు కాజ్‌వే మళ్లీ తెగిపోయింది. అలాగే మండలంలోని తిరువట్యం, సముదాయం, పాలమంగళం ఉత్తరపుకండ్రిగ బ్రిడ్జిపై నీళ్ల ప్రవహించడంతో ప్రజల రాకపోకలు ఆగిపోయింది. దీంతో ప్రజల రాకపోకలు గత మూడురోజులుగా ఆగిపోయింది. గత మూడేళ్లగా కురిసే వర్షానికి తాత్కాలికంగా మరమత్తు పనులు చేయడం ఆ తర్వాత భారీ వర్షం కురిస్తే మళ్లీ కాజ్‌వే తెగిపోవడం మాములుగా మారింది. కాజ్‌వే తెగిపోయిన తర్వాత అధికారులు మరమ్మతు పనులు చేయిస్తున్న శాశ్వత మరమ్మతు పనులను మాత్రం చేయడం లేదు.

**రాకపోకలు బంద్ చేసిన అధికారులు :** నారాయణవనం మండలంలోని తుంబూరు కాజ్‌వే తెగిపోవడంతో మండల అధికారుల బృందం గ్రామానికి వెళ్లారు. రోడ్డుకు ఇరువైపుల కంపలను వేయడంతో పాటు తాడుతో బంద్ చేశారు. ఎవరు కానీ కాజ్‌వేను దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ఇకపోతే ఇక్కడ పోలీసులతో బందోబస్తు పెట్టించారు. ఈ సందర్భంగా జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి.దివాకర్‌రెడ్డి, ఎంపిడిఓ గుణశేఖర్, ఎస్ఐ పరమేష్‌నాయక్, సర్పంచ్ నాగూరు, పిఆర్ ఎఇఇ ప్రకాష్‌రెడ్డిలు కాజ్‌వేను బంద్ చేయడంతో పాటు త్వరలోనే పంచాయతీరాజ్‌శాఖ తరపున శాశ్వత మరమ్మతు పనులు చేయిస్తామన్నారు.

## తుఫాను బాధితులకు సాయం

పుత్తూరురూరల్, డిసెంబరు 11 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం వేపగుంట దళితవాడలో మాండూస్ తుఫాను కారణంగా గోవిందమ్మకు చెందిన పూరిల్లు పడిపోవడంతో ఆదివారం మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలికి బియ్యం, నూనె, కందిపప్పు, కూరగాయలతో పాటు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పుత్తూరు మండల అధ్యక్షురాలు మునివేలు, తహసీల్దార్ రవి, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచ్‌లు గిరిజా ప్రసాద్, గోవిందస్వామిరెడ్డి, వైసీపీ నాయకులు నరసింహులు, బుజ్జి, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ విధానాలను తొలగించాలి - ఏపీటీఎఫ్

పుత్తూరురూరల్, డిసెంబరు 11 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీల జీవో 187లో అసంబద్ధమైన విధానాలను తొలగించాలని ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు నరేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 117 ద్వారా ఉపాధ్యాయ పోస్టులను మిగులుగా చూపించే ఆశాస్త్రీయమైన విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. బదిలీల్లో ఖాళీ పోస్టులను బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీగా ప్రదర్శించాలని అవసరమైన చోట విద్యా వలంటరీ నియమించాలని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అదనంగా ఇచ్చ ఐదు పాయింట్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## మీకు అండగా ఎమ్మెల్యే ఉన్నారు

- బియ్యపు పవిత్రరెడ్డి

రేణిగుంట, డిసెంబరు 11 ప్రభాతవార్త:



ఏ కష్టమొచ్చినా సాయం చేయడానికి ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్‌రెడ్డి ఉన్నారని మండల వైకాపా ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి అన్నారు. తుఫాను బీభత్సం కాస్త తగ్గుముఖం పెట్టిన తరువాత రేణి గుంట పట్టణంలోని వేణుగోపాలపురంలో ఆదివారం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డితో కలసి పవిత్రరెడ్డి వేణుగోపాలపురంలో పర్యటించారు. ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఆ ప్రాంత వాసుల పరిస్థితులను అవగతం చేసుకున్నారు. బీఎంఎస్ఆర్ సేవాదళ్ ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, సీనియర్ పాత్రికేయుడుమురగయ్య,వైకాపాసీనియర్‌నేతయోగేశ్వర్‌రెడ్డి,రసూల్ తదితరులు ఆమెతో పాటు ఉన్నారు.

## అర్హులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయండి - ఎంఎస్ఆర్

రేణిగుంట, డిసెంబరు 11 ప్రభాతవార్త:



రేషన్‌షాపు ద్వారా ప్రభుత్వాలు ఉచితంగా సరఫరా చేస్తున్న నిత్యావసర సరకులు సక్రమంగా పంపిణీ చేయాలని తారక రామానగర్ వైకాపా ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసు లురెడ్డి(ఎం ఎస్ఆర్) డీలర్‌ను కోరారు. ఆదివారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో శ్రీనివాసులు పర్యటిస్తుండగా ఆయనకు పలువురు లబ్ధిదారులు రేషన్‌షాపు డీలర్‌పై ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన రేషన్ షాపు వద్దకు వెళ్లి లబ్ధిదారులకు డీలర్ ద్వారా బియ్యం పంపిణీ చేయించారు. ఎవరికి ఎలాంటి సమస్యలు వచ్చినా తారకరామానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో తెలుపుకోవచ్చున్నారు. తక్షణం ఎమ్మెల్యే, మండల వైకాపా ఇన్‌చార్జి దృష్టికి సమస్యను తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆయనతో పాటు స్థానిక వైకాపా నేతలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం వస్తేనే ప్రజలకు మళ్లీ సంక్షేమం

గాలి భానుప్రకాష్

పుత్తూరు, డిసెంబరు 11 ప్రభాతవార్త :



ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రద్దు చేసి ఆ వర్గాలకు అన్యాయం చేసిందని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మళ్లీ సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఆదివారం పుత్తూరు మునిసిపాలిటీలోని ఆరో వార్డులో వైసిపి పాలనలో ' ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను స్వయంగా అంటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి రద్దు చేసిన అన్న క్యాంటీన్లు, ఆదరణ, వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు, ఆంక్షలు లేని దుల్హన్ పథకం, పెళ్లి కానుక, చంద్రన్న బీమా లాంటి పథకాలన్నీ టిడిపి అధికారంలోకి రాగానే పునరుద్దరిస్తామని తెలిపారు. ఆఖరికి చెత్త మీద కూడా పన్ను వేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టిడిపి హయాంలో వేసిన రోడ్లు, ఎల్ఇడి బల్బులు తప్ప వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. పరిశ్రమలు తరలిపోతున్నందున యువతకు ఉపాధి కరువై, నిరుద్యోగంప్రబలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు,ప్రధానకార్యదర్శిధనపాల్,రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు డి.ఎస్.గణేష్, ఇంకా నాయకులురఫీ,ఖాజాపీర్,అరుణాచలం,తురాబ్,హమీద్,షబ్బర్, మోహనకుమార , ఆర్ముగం పాల్గొన్నారు.

## మృతునికి రామ్‌ప్రసాద్‌రెడ్డి నివాళి

విజయపురం, డిసెంబరు 11 ప్రభాతవార్త :

మండల వైసిపి ప్రధాన కార్యదర్శి మునికృష్ణ తండ్రి ముకుందన్ (82) అనారోగ్యంతో జగన్నాధపురంలో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి మంత్రి ఆర్.కె.రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించి, కుటుంబానికి సంతాపం తెలిపారు. ఆయన మృతి పట్ల ఎంపిపి జమున, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పలువురు నాయకులు తమ సంతాపం తెలిపారు.

## మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం

తిరుపతి జిల్లా ట్రాఫిక్ డిఎస్పి కాటమరాజు

తిరుపతి క్రైం, డిసెంబర్ 11, ప్రభాతవార్త



మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తిరుపతి జిల్లా ట్రాఫిక్ డిఎస్పి కాటమరాజు పేర్కొన్నారు. తిరుపతి జల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం తిరుపతి నగరంలో ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్‌లు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే ముఖ్య ఉద్దేశంగా నగరంలోని పలు ప్రాంతాల నందు ట్రాఫిక్ నియమ నిభంధనలపై అవగాహన కార్యక్రమంతో పాటు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ఎక్కువ భాగం మైనర్ల వాహనాలు నడుపుట గుర్తించడం జరిగింది. వీటిని కట్టడి చేయాలనే ఉద్దేశంతో పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా అవగాహన కల్పించాలనే ట్రాఫిక్ డిఎస్పి కాటమరాజు, సిఐ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి సెల్‌ఫోన్ డ్రైవింగ్, విత్ఔట్ లైసెన్స్, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారికి స్టేషన్ నందు కౌన్సిలింగ్ ఇచ్చారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం వలన మీ విలువైన ప్రాణాలతో పాటు, ఎదుటి వారి ప్రాణాలకు కూడా హాని కలుగుతుందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# నష్టాలకు సంబంధించి...
# నివేదికలు సిద్ధంకు చర్యలు

**- క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు విస్తృతం - చెరువులు, వాగులు, వంకల వద్ద నిఘా**
**- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి - టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్**



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త: జిల్లాలో మాండూస్ తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాలకు సంబంధించి సత్వరం నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి ఆదివారం కలెక్టర్ హరినారాయణన్ ఆర్డీఓలు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌లతో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్లో అలర్ట్ వుందని మరో 48 గంటల పాటు ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. భూమి తడిగా వుండటంతో వర్షం పడిన వెంటనే నీటి ప్రవాహం ఎక్కువ అవుతుందని, వంకలు, వాగుల్లో నీటి ప్రవాహం సామర్థ్యంపై నిఘా వుంచాలన్నారు. వాగులు, వంకలు ప్రజలు దాటకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి జిల్లా, డివిజన్, మండలాలు, సచివాలయాల స్థాయిలో అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంట నష్టంను అంచనా వేయాలని, రోడ్లు, చెరువులు, ఇతర నష్టాలపై సాయంత్రంలోపు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వర్షాలకు ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి వుంటే సాయంత్రంలోపు సరి చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్టీఆర్ జలాశాయం, కృష్ణాపురం రిజర్వాయర్, వాగులు, వంకలు, చెరువుల వద్ద ఎప్పటికప్పుడు నీటి సామర్థ్యంపై నిఘాను పెంచాలని ఇరిగేషన్ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే పంట నష్టంకు సంబంధించి వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ అధికారులు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్లుఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాల్టీలు, గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ వైద్య సేవలను విస్తృతం చేయాలన్నారు.



**నుంజర్ల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ :**
మాండూస్ తుఫాను నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ హరినారాయణన్ యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని నుంజర్ల ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నుంజర్ల ప్రాజెక్టు పూర్తిగా నిండి ప్రవహిస్తుండటంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా వుండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, నీటి ప్రవాహంకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రాజెక్టుకు వెళ్ళే దారిలో వున్న చెట్లు, పొదలను శుభ్రం చేయాలని, ప్రాజెక్టుకు సాఫీగా వెళ్ళడానికి దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నుంజర్ల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 15.65 క్యూసెక్కులని, ఈ ప్రాజెక్టు నిండితే నుంజర్ల చెరువు, నడిమి చెరువులకు నీరు వెళ్తుందని తహసిల్దారు చిట్టిబాబు కలెక్టర్ హరినారాయణన్‌కు వివరించారు. ఎంపిడిఓ శివరామ్, ఎఇ కిషోర్‌కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిండు కుండలా జలాశయాలు

**- ఎన్టీఆర్, కృష్ణాపురం రిజర్వాయర్లలకు సమృద్ధిగా వర్షపు నీరు**


యాదమరి మండలంలోని నుంజర్ల ప్రాజెక్టు

చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త: జిల్లాలో మాండూస్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో జలాశయాలు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో పెద్ద రిజర్వాయర్లైన ఎన్టీఆర్, కృష్ణాపురం రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా చేరడంతో ఇరిగేషన్ అధికారులు ఈ జలాశయాల నుండి దిగువ ప్రాంతాలకు ప్రస్తుతం నీటిని విడుదల చేస్తున్నారు. చిత్తూరు నగరంకు సమీపంలో పెనుమూరు మండలం కలువగుంట వద్ద నిర్మించిన ఎన్టీఆర్ జలాశయం సామర్థ్యం 965.14 అడుగులు కాగా ప్రస్తుతం ఈ జలాశయంలో 963.58 అడుగుల నీటి నిల్వ వుంది. ఈ జలాశయం నుండి మంచినీటి అవసరాలకు అనునిత్యం 200 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తుండగా, జలాశయంకు 200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఇరిగేషన్ అధికారులు ఈ జలాశయం నుండి అనునిత్యం 200 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. అలాగే కార్వేటినగరం మండల పరిధిలోని కృష్ణాపురం జలాశయం సామర్థ్యం 213 మీటర్లు కాగా ప్రస్తుతం జలాశయంలో 209.75 మీటర్ల మేరకు నీరు నిల్వ వుంది. ఈ జలాశయం కెపాసిటీ 199.27 ఎంసిఎఫ్‌టిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 120.27 ఎంసిఎఫ్‌టిల నీరు నిల్వ వుంది. ఎగువ ప్రాంతాల్లో మాండూస్ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు నమోదు కావడంతో ప్రస్తుతం జలాశయంలోకి 102 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా ఇరిగేషన్ అధికారులు రోజు 5 క్యూసెక్కుల నీటిని జలాశయం నుండి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రం చిత్తూరుకు సమీపంలో యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి వద్ద వున్న నుంజర్ల ప్రాజెక్టు ప్రస్తుతం కురిసిన వర్షాలకు పూర్తి స్థాయిలో నిండింది. నుంజర్ల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 15.65 క్యూసెక్కులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 14.5 క్యూసెక్కుల మేరకు నీరు వచ్చి చేరింది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండితే ప్రాజెక్టుకు దిగువ ప్రాంతాల్లో వున్న నుంజర్ల చెరువుతో పాటు నడించెరువు పూర్తి స్థాయిలో నిండే అవకాశం వుంది. అలాగే నీవా నది ప్రవాహం పెరిగే అవకాశం వుంది.

# ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది


నాయుడుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి

నాయుడుపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త : నాయుడుపేట ప్రాంతంలో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. చిత్తూరు జిల్లా నుంచి ప్రారంభమయ్యే ఈ నది పెళ్లకూరు, నాయుడుపేట, చిట్టమూరు మండలాల మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఇటీవల వరకు బోసిపోయి ఉన్న స్వర్ణముఖి నది గత మూడురోజులుగా మాండోస్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో జలకళ సంతరించుకుంది.

నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు తరలివచ్చి తిలకిస్తున్నారు. నాయుడుపేట నుంచి వెంకటగిరికి వెళ్లేందుకు ఉన్న కాజ్‌వేను తాకుతూ నీరు ప్రవహిస్తోంది. సుమారు 10 అడుగుల ఎత్తులో ఉన్న కాజ్‌వేను తాకుతున్న నది ప్రవాహం ప్రమాదకరంగా ఉంది. మొత్తంమీద నదిలో నీరు ప్రవహిస్తుండటంతో భూగర్భజలాలు పెరిగి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## డాక్టర్ యుగంధర్‌కు అబ్దుల్ కలాం మెమోరియల్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



తిరుపతి నగరం, డిసెంబరు 11 ప్రభాతవార్త : ఐఎంఏ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిరుపతి మాజీ ఐఎంఏ కార్యదర్శి ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ యుగంధర్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం శ్రీ రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళాయూని వర్శిటీలో జరిగిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రధానోత్సవంను నిర్వహించారు. అటు వైద్య రంగంలోనూ ఇటు సేవా రంగం లోనూ ఆయన అందించిన సేవలను మరువలేనివని, ముఖ్యంగా కరోనా సమయంలో కోవిడ్ రోగులకు ఆయన అందిం చిన వైద్య సేవలు వైద్య శిబిరాలను దృష్టిలో ఉంచుకుని ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగిందని, అంతే కాక ఉత్తమ చర్మవ్యాధి వైద్య నిపుణులుగా గుర్తించడం జరిగిందని సొసైటీ నాయకులు తెలిపారు. కరోనా సమయంలో డాక్టర్ యుగంధర్ దాదాపు లక్ష మంది కోవిడ్ రోగులకు వైద్య సేవలు, తన సూచనలు సలహాలతో కోవిడ్ బారిన పడకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ఎంతో గొప్పవారైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అంతే కాక అవార్డును రిటైర్డ్ డైరెక్టర్ అండ్ సైంటిస్ట్ డీఆర్‌డీవో డాక్టర్ వత్సల్, పద్మావతి యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మమత, నేషనల్ ఐఎంఏ ఛైర్మన్ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఐఎంఏ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దగ్గుపాటి శ్రీహరిరావు చేతులు మీదుగా అందుకోవడం మరింత ప్రోత్సాహాన్ని పెంచిందని మునుముందు మరెన్నో సేవా కార్యక్రమాలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## గణనాధుని సేవలో కృష్ణపట్నం పోర్టు ఎండీ

కాణిపాకం, డిసెంబర్ 11 ప్రభాతవార్త: అదాని గ్రూప్ కృష్ణపట్నం పోర్టు ఎండీ జీజె.రావు ఆదివారం కాణి పాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేద మంపడపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, పారిశ్రామికవేత్త కుంటముక్కల కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## పునర్వసు నక్షత్రం శ్రీ సీతారాముల కళ్యాణం

**టిక్కెట్ ధర దంపతులకు రూ.300-లు-కోదండ రామాలయ ఏఈఓ పార్థసారధి**

చంద్రగిరి, డిసెంబర్ 11 ప్రభాతవార్త: శ్రీరామచంద్రుడు జన్మించిన పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీసీతారాముల కళ్యాణ మహో త్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఇ ందులో భాగంగా శ్రీకోదండ రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టర్ శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించారు. మేళతాళాలు, మంగళవాయిధ్యాల నడుమ శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఏఈఓ పార్థసారధి మాట్లాడుతూ టిటిడి అనుబంధ శ్రీకోదండ రామాలయంలో ప్రతి నెలా పునర్వసు నక్షత్రం రోజున శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాములవారి కళ్యాణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు దంపతులకు (ఇద్దరికి) టిక్కెట్ ధర రూ,300/-లు అన్నారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు రవిక, పంచె, ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. మనవూరు మనగుడి మనమే అభివృద్ధి చేసుకోవాలని చంద్రగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాల కృష్ణయ్య, సిబ్బంది శారద, మోహన్ స్వామి, చిరంజీవి, దేసయ్య, శంకరయ్య, యువరాజు, రమణ, రోజా, భక్తులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ తీరుపై నిరసనతో
## తెలుగుయువత నాయకుల అరెస్టు

తిరుపతి,డిసెంబర్ 11ప్రభాతవార్త: రాష్ట్రంలో అధికార వైసిపి ప్రభుత్వ పాలనపై, రాష్ట్రం గంజాయి,డ్రగ్స్‌కు నిలయంగా మారిందని శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తే పోలీసులు తెలుగుయువత నాయకులను అరెస్టు చేయడం దారుణమని తెలుగుదేశం నాయకులు మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో డ్రగ్స్,గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ప్లకార్డులతో నిరసన చేపట్టేందుకు వస్తే తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు, నాయకులు ఆర్‌పి శ్రీనివాసులు, కరణంసందీప్, కృష్ణయాదవ్‌లను అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. దీంతో వివేకానంద కూడలి వద్ద రభస జరిగింది. అరెస్టు చేసిన వారిని అలిపిరి పోలీసుస్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు అలిపిరి పోలీసుస్టేషన్ చేరుకుని అరెస్టు చేసిన వారిని విడుదల చేయించారు.



## తడలో మళ్లీ వర్షం.. భయం భయం



తడ, డిసెంబర్ 11 ప్రభాతవార్త : తడ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నుంచి మళ్లీ భారీవర్షం మొదలైంది. మధ్యాహ్నం నుంచి జల్లులు జల్లులుగా మొదలైన వాన రాత్రి సమయానికి భారీగా కురుస్తోంది. ఈ వర్షంతో మళ్లీ వరద ముప్పు తప్పదని మండల ప్రజలు పులికాట్ తీరప్రాంత గ్రామాల వారు భయపడుతున్నారు. తడ, తడకండ్రిగ పంచాయతీలకు చెందిన 157 మంది లోతట్టు ప్రాంతాల వారిని తడ హైస్కూలుకు తరలించినట్లు తహశీల్దార్ రామయ్య ఆదివారం సాయంత్రం తెలిపారు. ఇప్పటికే ఎక్కువమందిని పునరావాస కేంద్రాల్లో ఉంచామని, వారికి భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తహశీల్దార్‌తో పాటు ఎంపిడిఓ మురళీకృష్ణ, గృహనిర్మాణ శాఖ ఎఇ సత్యనారాయణ తదితరులు పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారికి ధైర్యం చెప్పారు.

## వర్షంతో దుముకుతున్న జలపాతాలు..!



నారాయణవనం, డిసెంబర్ 11 ప్రభాతవార్త : మాండూస్ తుఫాన్‌తో నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో కైలాసనాధ కోన, సింగిరికోన, మూలకోన జలపాతాలు సుమారు 20 అడుగుల ముందుకు వచ్చి దుముకుతున్నది. కురుస్తున్న వర్షంతో జల పాతం ఉధృతంగా ప్రవహించడంతో పర్యాటకులు జలపాతంలో స్నాన ం చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. నడింకోన, సింగిరికోనలోను జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నది. కార్తీక సోమవారాలు కావడంతో భక్తుల సందడి ఏర్పడింది.

## వగత్తూరు లోని ఇళ్ళలోకి వర్షపునీరు



కేవీబీ పురం, డిసెంబరు 11 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం వగత్తూరు గ్రామ పంచాయతీలో మాండూస్ తుఫాను కారణంగా గిరిజన కాలనీకి వద్ద అడవి నుంచి చెరువుకి నీరు వెళ్లే కాలువ తెగిపోవడంతో ఇళ్ళలోకి నీరు చేరాయి. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక సర్పంచ్ కాటమ్మ గోపాల్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే కాలువ గండికి మట్టి బస్తాలతో నింపి పూడ్చారు.

## వర్షంతో నేలకొరిగిన పంటలు



విజయపురం, డిసెంబరు 11 ప్రభాతవార్త : తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు పంటలు నేలకొరిగాయి. మాధవరం, కాళికాపురం ప్రాంతాల్లో వేరుసెనగ పంట నీట మునిగింది. చెంగమనాయుడు కండ్రిగ వద్ద వరి పంట నేలకొరిగింది. కెబి శ్రీరామాపురం వద్ద చెరుకు పంట ఈదురు గాలులకు నేలకు ఒరిగిపోయింది. పంటలు చేతికందే సమయంలో వర్షం వల్ల నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## గుంతలమయంగా రోడ్లు.. ప్రజలకు తప్పని తిప్పలు



కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారి పోయాయి. దీంతో ఆ మార్గాల్లో తిరిగే ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖల పరిధి లో రోడ్లను గతంలో ఏర్పాటుచేశారు. అయితే ఈ రోడ్లు ప్రస్తుతం చాలావరకు గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం వస్తే ఇక చెప్పాల్సిన పనిలేదు. ఈ గుంతల నిండా నీరు చేరిపోయి చిన్నపాటి చెరువు లను తలపిస్తున్నాయి. మండలంలోని పట్టణ కేంద్రమైన మల్లా నూరు, వానగుట్టపల్లి పంచాయతీ రాగిమానుమిట్ట గ్రామాల రోడ్లతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. కుప్పం పట్టణం గుడుపల్లె మార్గంలో సైతం రోడ్డుపై గు ంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్లపై ఉన్న గు ంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా ఉద్యానవన అధికారిచే పంటల పరిశీలన



శాంతిపురం, డిసెంబర్11 ప్రభాతవార్త : మండలంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఉద్యానవన పంటలను ఆదివారం జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి పరిశీలించారు. సొన్నేగానిపల్లి, కూతేగానిపల్లి గ్రామంలో కూరగాయపంటలు, చామంతి తోటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు ఆర్‌బికె కేంద్రాల్లో సంప్రదిస్తే పంట నష్టం అంచనా వేయ డబం జరుగుతుందన్నారు. తుఫాను ప్రభావంతో పంట పొలాల్లో అధికంగా నీరు ఉన్న నేపథ్యంలో నీటికి రైతులు బయటకు పంపాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే పాలీఫీడ్ లేదా మల్టీకె ఐదునుంచి ఏడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారిణి డింపుప్రియశ్రీ, ఆర్‌బికె అధికారి మనోజ్‌కుమార్, రైతులు కృష్ణారెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ కార్యాలయ పాత భవనంను పరిశీలించిన మేయర్ శిరీష



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 11, ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయం పాత భవనంను ఆదివారం మేయర్ డా. శిరీష పరిశీలించారు. మేయర్ దగ్గరుండి పరిశీలించి త్వరగా వ్యర్థాలు, కమ్మి తదితర వాటిని త్వరగా తరలించాలని

## కనువిందు చేస్తున్న జలపాతాలు-పర్యాటకుల సందడి


వేయిలింగాలకోన జలపాతం దృశ్యం

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త : తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీకాళహస్తి మండలంలోని జల పాతాలు సందడి చేస్తున్నాయి. దీంతో పర్యాటకులు, స్థానికుల తాకిడి ఎక్కువైంది. మండలంలోని వేయిలింగాలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలువురు పర్యాటకులు ఇక్కడకు చేరుకుని ఫోటోలు తీసుకోవడం సందడిచేస్తోంది. గిరిప్రదక్షిణ మార్గంలో కైలాసగిరుల్లో నుంచి వర్షపునీరు ప్రవహిస్తుండడం కనువిందు చేస్తోంది. ఇక దక్షిణకాళికామాతా ఆలయం ఎదురుగా ఉన్న భైరవకోనలో వెలసిన పరమేశ్వరునిపై నీటి ప్రవాహం దృశ్యం కమనీయంగా కనిపించడంతోపాటు, రాజీవ్‌నగర్‌సమీపంలోని గిరి ప్రదక్షిణ మార్గంలో ఉన్న పనసకోన జలపాతం కమనీయంగా మారింది. ఇక్కడకు పలువురు అయ్యప్పభక్తులు విచ్చేసి స్నానమాచరించడం గమనించదగ్గ విషయం.

## ఇండ్లలోకి చేరిన నీళ్ళు-పలు గ్రామీణ రోడ్లు అస్తవ్యస్థం

**-ఆదివారం సాయంత్రం భారీ వర్షం**


కొత్తకండ్రిగ గ్రామంలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు

తొట్టంబేడు, డిసెంబర్ 11 ప్రభాతవార్త : తుఫాను ప్రభావం తొట్టంబేడు మండలాన్ని తీవ్రంగా కుదిపే సింది. లోతట్టు ప్రాంతాల్లో సహా పలుదళిత, గిరిజనవాడలు నీటితో నిండిపోయాయి. ఎక్కడ చూసినా రోడ్లపై నీటిప్రవాహం కనపడుతూ పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరపిలేని వర్షం పడడంతో మండలంలో ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు 216.6మి.మీ వర్షపాతం నమోదవడం రికార్డుచోటుచేసుకుంది. మండలంలో ఈనెల వర్షపాతం 175.5 మి.మీ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా ఈనెల 2వతేదీన 13మి.మీ. 9వ తేదీన 3.6మి.మీ వర్షపాతం నమోదైంది. ఒక్క పదోతేదీ మాత్రమే 216.6మి.మీ వర్షపాతం నమోదైంది. గతనెల సాధారణ వర్షపాతం 330.4 మి.మీ ఉండగా 267.6మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇక వరుణుడు కరుణించాడనుకుంటున్న సమయంలో ఆదివారం సాయంత్రంనుంచి గ్రామాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు గ్రామాల్లో ప్రజల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. తొట్టంబేడు మండలంలో ఆదివారం రాత్రి 7గంటల వరకు 12.4మి.మీ వర్షపాతం నమోదైంది. ఓవైపు లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లు నీటిలో ముగిపోవడంతో పాటు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇక మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలో రోడ్డుపైనే నీటిప్రవాహం రావడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇండ్లలోకి నీరు చేరడంతో వారు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. గ్రామంలోని నిమ్మకాయల శ్రీరాములురెడ్డి, లక్ష్మమ్మలు ఇంటిలోకి నీరు మోకాలిలోతు చేరడంతో వారిద్దరిని చుట్టుపక్కల కాలనీ వాసులు వారి ఇంటికి తీసుకెళ్ళారు. ఇక కారాకొల్లు గ్రామానికి వెళ్ళే సమీపంలో ఉన్న వాగు పొంగడంతో దొంగలముదూరు, కారాకొల్లు గ్రామాలకు రాకపోకలు లేవు. ఇక చిట్టత్తూరు నుంచి రామలింగాపురంకు వెళ్లే మార్గం వర్షపునీటితో కొట్టుకుపోవడంతో ఈమార్గంలో కూడా రాకపోకలు లేవు.

**ఎప్పటికప్పుడు పరిశీలన..తహశీల్దార్**
వర్షాభావ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవర్షాభావ పరిస్థితిని తెలుసుకునేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు. చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. చెరువుల్లో నీరు ఎక్కువైనపుడు గ్రామస్తులు, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో గండికొట్టించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సచివాలయాల్లో సిబ్బంది కూడా అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూంను ఏర్పాటుచేశామని ఏవైనా ఇబ్బందులు ఉంటే 9491077046 నంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు.

## వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురు మృతి



చంద్రగిరి, డిసెంబర్ 11 ప్రభాతవార్త: మండల పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు ముగ్గురు మృతి చెందారు. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం పంచాయతీ, రవణప్పగారి పల్లి వద్ద శనివారం రాత్రి కంటైనర్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. అదేవిధంగా ఆదివారం మదనపల్లి తిరుపతి జాతీయ రహదారి భాకరాపేట ఘాట్ రోడ్ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవణప్పగారిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో కర్ణాటక, కోలార్‌కు చెందిన మిట్టపల్లి పార్థసారధి (24) అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా, సుండుపల్లికి చెందిన నాగరాజు కుమారుడు నితీష్ (17), సుండుపల్లి మండలం, కంటిపట్టులవాండ్లపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు చంద్రశేఖర్ (22) ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తున్నారు. భాకరాపేట ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతా చెందగా, నితీష్ తిరుపతి రుయాలో వైద్య చికిత్సలు పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## భక్తులతో పోటెత్తిన బోయకొండ



బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 11 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొండ దినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేకాభిషేకం, అలంకరణగావించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. మండూస్ తుఫాన్‌ను సైతం లెక్క చేయకుండా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయ ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు సేవలందించారు.